దర్శి, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి దారుణంగా ఉంది. చాలీచాలని వసతులతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మూడు నెలలుగా కనీస మెనూ కూడా అమలు చేయడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దర్శి గురుకుల పాఠశాల విద్యార్థులు అంటువ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. గజ్జి, తామర పట్టి పీడిస్తోంది. అంతేకాకుండా గురుకుల ఉపాధ్యాయులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వక పోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


వై.పాలెంలోని ఎస్సీ బాలికల హాస్టల్ పరిస్థితి ఇదీ..


జ్వరాలతో పడకేసిన విద్యార్థినులు


గురుకుల విద్యార్థి వేళ్లకు అంటుకున్న గజ్జి


గురుకుల విద్యార్థి చేతికి చీముగుళ్లు

హాస్టళ్లలో అవస్థలు

- సమస్యల వలయంలో గురుకుల విద్యార్థులు
- కుళ్లిన గుడ్లు పెడుతున్నారంటూ ఆవేదన
- సంక్షేమ హాస్టళ్లలో కాస్మొటిక్స్ చార్జీలూ కరువే
- టీచర్లకు మూడు నెలలుగా అందని జీతాలు


దర్శి గురుకుల పాఠశాల


మారెళ్ల వసతి గృహంలో రాత్రి భోజనం చేస్తున్న విద్యార్థులు


జ్వరంతో వైద్యశాలకు వెళ్లి మందులు తెచ్చుకుంటున్న గిరిజన విద్యార్థి

దర్శి/యర్రగొండపాలెం: దర్శి పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గజ్జి, తామర, దురదతో విద్యార్థులు అల్లాడిపోతున్నారు. పాఠశాలలో రెండు బోర్లు ఉండగా ఒక బోరు మాత్రమే పని చేస్తోంది. అది కూడా నీరు అందక పోవడంతో మోటారు బయటకు తీసి ప్రెస్సింగ్ చేయాలని మెకానిక్‌లు తెలిపారు. విద్యార్థులకు కుళ్లిన గుడ్లు పెడుతున్నారని, అన్నం ఉడక్కుండానే పెడుతున్నారని విద్యార్థులు చెప్తున్నారు. మిగిలిన అన్నం మరుసటి పూట పెడుతున్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్నం తినలేక విద్యార్థులు డస్ట్‌బిన్‌లో వేస్తున్నారు. మూడు నెలలుగా ఇప్పటి వరకు కాస్మొటిక్స్ చార్జీలు కూడా ఇవ్వడం లేదు. దీనికి తోడు ఔట్ సోర్సింగ్, రెగ్యులర్, కాంటాక్ట్, నాన్ టీచింగ్ ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. ఉపాధ్యాయులు తమ సొంత నిధులతో గురుకుల పాఠశాలను మెయింటెనెన్స్ చేసుకుని రావాల్సిన దుస్థితి ఏర్పడింది. బాత్‌రూమ్‌ల పరిస్థితి మరింత అధ్వానంగా, అపరిశుభ్రంగా ఉన్నాయి. విద్యార్థులే బాత్‌రూమ్‌లు కూడా క్లీన్ చేసుకోవాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. గజ్జి, తామరకు మందులు కూడా పూర్తి స్థాయిలో లేవు. ట్యాబ్లెట్ ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. పరిస్థితి తీవ్రమైతే విద్యార్థులను ఇళ్లకు పంపుతున్నారు. చేతులకు చీము గుళ్లలు లేచి విద్యార్థులు అల్లాడుతున్నారు. దీనికి కారణం విద్యార్థులకు కాస్మొటిక్స్ లేకపోవడమే అని తెలుస్తోంది. అంటువ్యాధులు ఒకరి నుంచి మరొకరికి ప్రబలి విద్యార్థులు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీకావు. గతంలో ఎన్నడూ లేని విధంగా మూడు నెలల్లోనే ఇంత దుస్థితి వచ్చిందంటే ఇక పట్టించుకోక పోతే అటువ్యాధులు ఏస్థాయికి చేరుతాయో అని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధింత అధికారులు స్పందించి విద్యార్థుల సమస్యలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

హాస్టళ్ల పరిస్థితి దయనీయం

సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. దర్శి బీసీ హాస్టల్లో భవనం వర్షం కురిస్తే కారిపోయే పరిస్థితి ఉంది. భవనం క్రాకులు వచ్చి ఫోర్టికో ఎప్పుడు కూలిపోతుందో అర్థంకాని పరిస్థితులు ఉన్నాయి. ఒక్క ఫ్యాన్‌కు 12 మంది విద్యార్థులు తల దాచుకుంటున్నారు. దోమలు విపరీతంగా ఉండి నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. బీసీ బాలికల హస్టల్ కూడా ఇదే విధంగా ఉంది. ఎస్సీ హాస్టల్లో మరుగు దొడ్లు సరిగా లేవు. హాస్టళ్ల శుభ్రత లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

సర్వర్లుగా మారిన విద్యార్థులు

యర్రగొండపాలెం నియోజకవర్గంలోని గురుకుల వసతి గృహాల తీరు మారినట్లు కనిపించడం లేదు. విద్యార్థులతో పనులు చేయించడం ఆనవాయితీగా మారింది. గత నెల 4వ తేదీన స్థానిక గిరిజన (జనరల్) సంక్షేమ గురుకుల పాఠశాలలో పిల్లలతో చపాతీలు చేయించడం పెద్ద ఎత్తున దుమారం లేపింది. ఇటువంటి సంఘటనలకు తావివ్వకుండా ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలుస్తోంది. స్థానిక మాచర్ల రోడ్డులోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల (ఎస్టీ జనరల్)లో విద్యార్థులను సర్వర్లుగా మార్చిన సంఘటన ‘సాక్షి’విజిట్‌లో తెలిసింది. ఇటీవల ఆ కళాశాలలో భోజనం చేసే సమయంలో విద్యార్థులు తమ తోటి విద్యార్థులకు పదార్థాలను వడ్డించడం కనిపించింది. ఈ దృశ్యాన్ని ఫొటోలు తీస్తుంటే కొంతమంది వర్కర్లు అడ్డుకున్నారు. వడ్డించే విద్యార్థులు అక్కడి నుంచి తప్పుకున్నారు. స్థానిక ఎస్సీ బాలురు, బాలికల హాస్టళ్లలో వసతులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. ఈ రెండు వసతి గృహాలకు సంబంధించిన భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. నీటి వసతి, బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు అరకొరగా ఉన్నాయి. వారు ఆరు బయటే స్నానాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బాలుర హాస్టల్లో 63 మంది విద్యార్థులు ఉంటున్నారు. వీరు బస చేసేందుకు 8 గదులు ఉన్నాయి. బాలికల వసతి గృహంలో 260 మంది విద్యార్థినులు ఉన్నారు. వీరు బస చేయటానికి కేవలం ఐదు గదులు మాత్రమే ఉండటంతో డైనింగ్ రూమ్, స్టోర్ రూమ్, వరండాల్లోనే రాత్రి వేళల్లో నిద్రపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బాత్ రూమ్‌లు 10 ఉన్నా కేవలం 5 మాత్రమే ఉపయోగంలో ఉన్నాయని విద్యార్థినులు తెలిపారు. హాస్టల్ ప్రధాన ద్వారం నుంచి లోపలికి ఎవరూ రాకుండా జాగ్రత్తలు తీసుకొని చిన్న పిల్లలు ఆరుబయటే స్నానాలు చేస్తుంటారని తెలిపారు. కిటికీలకు తలుపులు సక్రమంగా లేకపోవడంతో వర్షా కాలంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద దోర్నాలలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ బాలుర పాఠశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో సరిపడా గదులు లేకపోవటంతో విద్యార్థులు తమ లగేజీలకు సంబంధించిన పెట్టెలను ఆరుబయటే పెట్టుకున్ని విద్యనభ్యసిస్తున్నారు. పుల్లల చెరువు, త్రిపురాంతకం, పుల్లలచెరువుల్లో ఉన్న ఎస్సీ, బీసీ హాస్టళ్లలో నీటి సమస్య ఎక్కువగా ఉంది. సరిపడినన్ని గదులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా హాస్టళ్లలో ఉండి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు సీజనల్ వ్యాధులు వెంటాడుతున్నాయి. అనునిత్యం ప్రతి హాస్టల్ నుంచి ఇద్దరు, ముగ్గురు విద్యార్థులను వైద్యశాలకు తీసుకొని వెళ్లి వైద్యం చేయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కనీస వసతులు కరువు

ముండ్లమూరు: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో కనీస వసతులు లేకుండా పోయాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మారెళ్ల సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, వసతి గదులు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు సక్రమంగా లేక పోవడంతో నానా అవస్థలు పడుతున్నారు.

ఉద్యోగినులపై టీడీపీ నాయకుల వేధింపులు

పెద్దదోర్నాల: ఉద్యోగం నుంచి తొలగిస్తున్నాం .. ఇక్కడి నుంచి వెళ్లి పోవాలంటూ కొందరు టీడీపీ నేతలు తమను వేధిస్తున్నారంటూ మండల పరిధిలోని మల్లికార్జునపురం ఏపీ మోడల్ స్కూల్ వార్డెన్, వంట మనుషులుగా విధులు నిర్వహిస్తున్న పలువురు మహిళలు వాపోతున్నారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్కూల్లో విధులు నిర్వహిస్తున్న తమను టీడీపీ నాయకులు అడ్డుకుని వంట గది తాళాలు లాక్కున్నారని వార్డన్ డెబోరా, వంట మనుషులు అల్లు లక్ష్మీదేవి, కోమల, రవణమ్మలు ఆరోపిస్తున్నారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు వేడుకుంటున్నారు.

గృహ నిర్మాణాలు తక్షణమే పూర్తి చేయాలి

ముండ్లమూరు (దర్శి): గత ప్రభుత్వ హయాంలో మధ్యలో నిలిచిన గృహ నిర్మాణాలను తక్షణమే పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని గృహనిర్మాణ శాఖ ఏఈ హనుమంత రావు తెలిపారు. స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019–2024 మధ్య కాలంలో ఇళ్లు మంజూరై వివిధ కారణాలతో మధ్యలో నిర్మాణం నిలిపేసిన లబ్ధిదారులు తక్షణమే పనులు ప్రారంభించి పూర్తి చేసుకోవాలన్నారు. నిర్మాణ స్థాయి ఆధారంగా వంద రోజుల్లో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుంటే బిల్లులు మంజూరు చేస్తామని తెలిపారు. 2014–2019 కాలంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం ద్వారా ఇంటి నిర్మాణం మొదలు పెట్టి వివిధ కారణాలతో బిల్లులు మంజూరు కాని లబ్ధిదారుల వివరాలు ప్రభుత్వం విడుదల చేసిన ప్రత్యేక యాప్‌లో నిర్మాణ దశను నమోదు చేస్తామని తెలిపారు. లబ్ధిదారులు తమ ఇంటి పనికి సంబంధించిన పనులు చేసుకుంటే ఉపాధి హామీ పథకం ద్వారా 90 రోజులకు మస్టర్లు వేస్తామని చెప్పారు. అందుకు సంబంధించిన బిల్లులు వెంటనే జమ చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని గృహ నిర్మాణ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం సిబ్బంది లబ్ధిదారులను నేరుగా కలిసి వివరాలు నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఏపీఓ నాగరాజు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

యర్రగొండపాలెం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శుక్రవారం విరాళాలు సేకరించారు. ర్యాలీగా బయల్దేరిన వీరు బస్టాండ్ సెంటర్‌లోని దుకాణాలు, టీ స్టాళ్ల వద్దకు వెళ్లి విరాళాలు సేకరించారు. విద్యార్థులతో పాటు ఆ కళాశాల లెక్చరర్‌లు పాల్గొన్నారు. మొత్తం రూ.37,513 విద్యార్థులు విరాళాలు సేకరించారని ప్రిన్సిపాల్ శ్రీధర్‌నాయుడు తెలిపారు.

పాల విలువ జోడిత ఉత్పత్తులపై శిక్షణ

దర్శి: పాల విలువ జోడిత ఉత్పత్తులపై స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో మూడు రోజులు పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గృహ విజ్ఞాన శాస్త్రవేత్త టి. మానస తెలిపారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో మానస అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేవీకే సమన్వయకర్త డాక్టర్ జి.రమేష్ మాట్లాడుతూ పాల ఉత్పత్తులను ఎలా చేయాలి, వాటి నుండి మహిళలు ఎలా తమ ఆర్థిక పరిస్థితి మెరుగు పరుచుకోవాలో వివరంగా తెలియజేశారు. మహిళలకు పన్నీర్, పాలకోవా, రసగుల్లా, రసమలై, బ్రెడ్ కస్టర్డ్, ఫ్రూట్ కస్టర్డ్, రోస్ మిల్క్, బాదం మిల్క్ వంటి ఉత్పత్తులు తయారు చేయడంలో శిక్షణ ఇచ్చారు.

మట్టి గణపతిని పూజిద్దాం..


దర్శి: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేసిన మట్టి గణపతులు


కురిచేడు: విద్యార్థులతో మట్టి గణపతి విగ్రహాలు తయారు చేయించిన హెచ్‌ఎం సాయి


దర్శి: మట్టి గణపతులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

దర్శి: మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణ పరిరక్షణకు తోడ్పడదాం.. అంటూ వినాయక మట్టి ప్రతిమలు ఉచితంగా పంపిణీ చేసేందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ ఆధ్వర్యంలో వందలాది మట్టి వినాయక ప్రతిమలు సిద్ధం చేశారు. వినాయక చవితి సందర్భంగా రంగుల వినాయక ప్రతిమలు వాడరాదని, మట్టి గణపతులను పూజిస్తే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని ఈ నిర్ణయం తీసుకున్నట్లు క్లబ్ ప్రతినిధి సాగర్ తెలిపారు.

కట్టశింగన్నపాలెంలో..

మండలంలోని కట్టశింగన్నపాలెంలో మట్టి వినాయకున్ని మాత్రమే పూజించాలని, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని విద్యార్థులు గ్రామంలో మట్టిగణపతితో ప్రదర్శన చేశారు. ఉపాధ్యాయులు వేణు ఆధ్వర్యంలో విద్యార్థులు మట్టి గణపతులను తయారు చేసి తమ నివాసాల్లో పూజలు చేసేందుకు తీసుకెళ్లారు.

మట్టి గణపతి పర్యావరణానికి మేలు

కురిచేడు: వినాయక చతుర్థి నాడు మట్టి వినాయకుడి ప్రతిమలను వినియోగిస్తే పర్యావరణానికి ఎంతోమేలు జరుగుతుందని స్థానిక వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీర్ రంగసాయి తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులకు మట్టిగణపతిని చేసే విధానాన్ని నేర్పించి వారితో గణపతి ప్రతిమలు చేయించారు. దీంతో విద్యార్థుల్లో గణపతి ప్రతిమ చేసే నైపుణ్యం నేర్చుకోవటంతో పాటు వారి ఇళ్లలో మట్టి గణపతి ప్రతిమలు వినియోగిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ మట్టిగణపతి ప్రతిమలను వినియోగించి వినాయక చవితి పూజలు చేయాలని ఆయన సూచించారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

- పది మందికి గాయాలు


సంఘటన స్థలంలో బోల్తా కొట్టిన ట్రాక్టర్



క్షతగాత్రులు..

పెద్దారవీడు: ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని దేవరాజుగట్టు పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వినాయక చవితి పండగ సందర్భంగా మార్కాపురం పట్టణం నుంచి దొనకొండ మండలం దేశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దాదాపు పది మంది కలిసి ట్రాక్టర్లో వినాయకుని బొమ్మను తీసుకెళ్తున్నారు. అదే సమయంలో కంభం నుంచి త్రిపురాంతకం వైపు లారీ వెళ్తోంది. దేవరాజుగట్టు ఓవర్ బ్రిడ్జి దిగుతున్న సమయంలో పెట్రోల్ బంక్ దగ్గరకు రాగానే ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టింది. ట్రాక్టర్ బోల్తా పడటంతో అందులో ఉన్న బైరెడ్డి వెంకటరెడ్డి, నారు మల్లికార్జునరెడ్డి, చిలకల అభినాష్‌రెడ్డి, వనమాల అచ్చిరెడ్డితో పాటు మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను మార్కాపురం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందన సభ


నరసింహారావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


గురుప్రసాద్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

దొనకొండ: తోటి ఉపాధ్యాయులు వ్యాయాయ ఉపాధ్యాయుడు నరసింహారావును ఆదర్శంగా తీసుకుని ముందుకు నడవాలని ఎంపీడీఓ వి.వసంతరావునాయక్ సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వ్యాయామ ఉపాధ్యాయుడు కె.నరసింహారావుకు ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. జిల్లా విద్యాధికారులు నరసింహారావును ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా గుర్తించి గురు పూజోత్సవం సందర్భంగా సన్మానించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు అధ్యక్షతన నరసింహారావు దంపతులను ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయుడు నరసింహారావు కృషితోనే దొనకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలకు క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు వచ్చాయని గుర్తు చేశారు. నరసింహారావులా ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేసి విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడాలని ఎంపీడీఓ కోరారు.

ఉత్తమ హెచ్‌ఎంకు కూడా..

దర్శి: మండలంలోని చందలూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గురుప్రసాద్‌కు ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న సందర్భంగా పాఠశాల సిబ్బంది గురుప్రసాద్‌ను శుక్రవారం ఘనంగా సత్కరించారు. తెలుగు ఉపాధ్యాయులు వివేకా నంద అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీడీ అంజిరెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ రమణారెడ్డిలు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు మంచి విద్యను అందించడంలో ప్రధానోపాధ్యాయులు, తోటి ఉపాధ్యాయుల కృషి మరువలేనిదన్నారు. నాగేశ్వరరావు, పీవీరెడ్డి, మారుతీకిరణ్, చిట్టే సుబ్రహ్మణ్యం మల్లికార్జున పాల్గొన్నారు.

బాలికల సంరక్షణపై అవగాహన


మాట్లాడుతున్న ఎస్‌ఐ బాబూరావు

పుల్లలచెరువు: బాలికల సంరక్షణ, భద్రతపై బాలబాలికలకు అవగాహన ఉండాలని ఎస్‌ఐ బి.బాబూరావు అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికల చట్టాలు, సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ బాబూరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత ఆశయంతో ఇష్టంతో కష్టపడి చదువుకోవాలన్నారు. ముఖ్యంగా మారుతున్న పరిస్థితుల దృష్ట్యా సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, ఫొటోలు పోస్టు చేయడం, ఆన్‌లైన్‌లో పరిచయం లేని వ్యక్తులతో ఫోన్లో మాట్లాడడం, చాటింగ్ చేయడం వంటివి చేయకూడదన్నారు. బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తే నిందితులపై పోక్సో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రౌడీషీట్‌లు తెరిచి జైలుకు పంపుతామని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు వింటూ ఉన్నత చదువులు చదువుకోవాలని, తల్లిదండ్రుల ఎంతో కష్టపడి చదివిస్తున్నారని, వారిని, ఉపాధ్యాయులను గౌరవిస్తూ ముందుకు సాగాలని చెప్పారు. ఈ సందర్భంగా గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి విద్యార్థినులకు వివరించారు. హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


ఆలయం ప్రాంగణంలో మొక్క నాటుతున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

త్రిపురాంతకం: శ్రీబాలాత్రిపుర సుందరీదేవి, శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయాలను దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ దర్శించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. త్రిపురాంతకం ఆలయాల్లో అమ్మవారికి కుంకుమార్చన, స్వామి వారికి అభిషేకం చేసిన ఆయనకు ఆలయ అర్చకులు ప్రసాదాలు ఇచ్చి ఆశీర్వచనం అందించారు. అనంతరం ఆలయం వద్ద మొక్క నాటారు. పరిశుభ్రత పచ్చదనానికి ప్రాధాన్యం ఇవ్వాలని, పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ఈయన వెంట సీఐ సుబ్బారావు, ఎస్‌ఐ శివ బసవరాజు ఉన్నారు.

గణపతి మండపాల వద్ద జాగ్రత్తలు తప్పనిసరి

వినాయక చవితి సందర్భంగా భక్తులు ఏర్పాటు చేసే విగ్రహాల వద్ద పూజా కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఆయా కమిటీలు చూడాలని డీఎస్పీ లక్ష్మీనారాయణ సూచించారు. త్రిపురాంతకం పోలీస్ స్టేషన్‌లో వినాయక చవితి సందర్భంగా వినాయక ఉత్సవ సమితి సభ్యులతో ఆయన మాట్లాడుతూ పార్టీలు, వర్గాలుగా ఎలాంటి కార్యక్రమాలు ఉండరాదన్నారు. మహిళలకు, పిల్లలకు విగ్రహాల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని డీఎస్పీ సూచించారు.

ఆరు నెలల వరకు తల్లిపాలే ఇవ్వాలి

తాళ్లూరు (దర్శి): తమ పిల్లలకు ఆరు నెలలు వరకు తల్లిపాలే ఇవ్వాలని సీడీపీఓ సీహెచ్ భారతి అన్నారు. వెలుగువారిపాలెంలో పౌష్టికాహార మాసోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన సీడీపీఓ భారతి మాట్లాడుతూ పిల్లలకు రెండేళ్ల వరకు తల్లి పాలు ఇస్తూనే ఉండాలని చెప్పారు. బాలామృతం, కోడిగుడ్లు, పిల్లలకు రోజు వారీ ఆహారంలో తప్పని సరిగా ఇవ్వాలన్నారు. అనంతరం సామూహిక సీమంతాలు నిర్వహించి పౌష్టికాహారం స్టాళ్ల ఏర్పాటు చేశారు. తాళ్లూరు స్కూల్ ప్రధానోపాధ్యాయుడు పెద్దిరెడ్డి, ప్రీస్కూల్ కో ఆర్డినేటర్ వెంకట్, వెలుగువారిపాలెం స్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు నాగ సురేష్, సర్పంచ్ కోటేశ్వరమ్మ, ఏకే త్రివేణి పాల్గొన్నారు.

దొనకొండ: పౌష్టికాహారంతోనే ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి తెలిపారు. మండలంలోని పెదగుడిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే ఎంతో మంచిదని, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. బాలింతలు, గర్భిణులు రోజూ పాలు, గుడ్లు, కూరగాయలు తీసుకోవాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ప్రకృతి పదిలం

తాళ్లూరు (దర్శి): ప్రకృతి వ్యవసాయంతోనే ప్రకృతి పదిలంగా ఉంటుందని ప్రకృతి వ్యసాయం చేసేందుకు రైతులు ముందుకు రావాలని ప్రకృతి సాగు ఇన్‌చార్జి పి.నరశింహులు కోరారు. తూర్పు గంగవరం రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ రైతులు, మహిళా రైతులకు కషాయాలు కలుపుకునే డ్రమ్ములు, కల్లం పనులు చేసుకునే పట్టలు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాయితీపై శుక్రవారం అందజేశారు. వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నరశింహులు మాట్లాడుతూ నాగంబొట్లపాలెం యూనిట్ పరిధిలో 370 మంది రైతులు 425 ఎకరాల్లో ప్రకృతి సాగుకు సంబంధించిన పనులను వారి పండ్ల తోటలు, కూరగాయలు, ఆకుకూరలు, ధాన్యపు, చిరుధాన్యపు, అపరాల్లో ప్రాక్టీస్ చేస్తున్నారన్నారు. వీఏఏ సుమ, ఐసీఆర్ మౌనిక, పల్లవి, కోటి రత్తమ్మ, వాణి, వై.కాశిరెడ్డి, చందన, చాట్ల ఇమ్మానియేలు పాల్గొన్నారు.